క్లుప్తంగా

ఆకతాయిలపై సమాచారం ఇవ్వాలి



రాజోళి: సోషల్ మీడియాలో వచ్చిన మెసేజ్‌కు రాజోళి ఎస్‌ఐ గోకారి స్పందించారు. ఆదివారం రాత్రి సమయంలో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఆకతాయిలు మద్యం తాగి సీసాలు పడేసి పరిసరాలను అపరిశుభ్రం చేశారు. వీటికి సంబంధించిన ఫోటోలను కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ పోస్టును జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు నిషాక్ ఎస్‌ఐకి పంపారు. దీంతో ఆయన పోలీసులు పెట్రోలింగ్‌కు పంపారు. ఈ క్రమంలో సోమవారం సిబ్బందితో పాఠశాలకు వచ్చి పరిసరాలను ఎస్‌ఐ పరిశీలించారు. అత్యవసర సమయాల్లో పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తరుచూ పోలీస్ వాహనంలో సిబ్బంది పెట్రోలింగ్ చేస్తారని ఎస్‌ఐ పేర్కొన్నారు.

అధిక ఫీజులు నియంత్రించాలని వినతి



రాజోళి: ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు నియంత్రించాలని బీజేపీ వడ్డేపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. ఈ మేరకు వడ్డేపల్లి ఎంఈఓ నర్సింహాకు సోమవారం శాంతినగర్‌లో వినతిపత్రం అందచేశారు. రూ.300 విలువ చేసే డ్రెస్‌ను రూ.1,000కు అమ్ముతున్నారని, స్కూల్ ఫీజులు కూడా విచ్చలవిడిగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఫిట్‌నెస్ లేని బస్సులకు అనుభవం లేని డ్రైవర్లను తక్కువ జీతాలకు పెట్టి పిల్లల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకుని, నియంత్రణను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, వెంకటేశ్వర్లు, మోహన్‌యాదవ్, శేఖర్ ఆచారి, ఈశ్వర్ పాల్గొన్నారు.

వ్యాపారులపై అనుచిత వ్యాఖ్యలు

గద్వాల క్రైం: వస్త్ర వ్యాపారులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న యువకుడిపై సోమవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పద్మశాలీ సేవా సంఘం వ్యాపారులు తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన నవీన్ అనే యువకుడు కృష్ణారెడ్డి బంగ్లా కాలనీలో పద్మశాలీ సంఘం వ్యాపారులు గద్వాల చేనేత చీరల వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో సదరు యువకుడు వ్యాపారులతో దురుసుగా వ్యవహరించడంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి చీరలు కోనేందుకు వచ్చిన కొనుగోలు దారులతో తరచూ వాగ్వాదం పెట్టుకుంటున్నాడని తెలిపారు. సదరు యువకుడుకి వ్యవహారంపై వ్యాపారులు పలుమార్లు నచ్చజెపిన ప్పటికీ మార్పు లేకపోయిందన్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి 8 గంటల సమయంలో పలు దుకాణాల వద్దకు వచ్చి అనుచితంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు చేశారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ సంఘం నాయకులు శ్రీకాంత్, సాయిబాబ, శ్రీనివాసులు తదితరులు పట్టణ పోలీసులకు కోరారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

మహబూబ్ నగర్ న్యూటౌన్: వర్షాకాల సీజన్‌లో రైతులకు ఎరువులు కొరత లేకుండా చూడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు జయలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరించడం సరికాదన్నారు. ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే ఎరువుల నిల్వలు ఉంచాల్సింది పోయి పట్టించుకోకుండా కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రాములు, కార్యదర్శివర్గ సభ్యులు కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, పద్మ, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జేపీఎన్‌సీలో వర్క్‌షాప్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేపీఎన్‌సీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ ఆన్ స్టూడెంట్ రీడినెస్ ఫర్ కెరియర్ బిల్డింగ్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు ఇలాంటి వర్క్‌షాప్‌ల వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని, నైపుణ్యాలు పెంచుకోవడంతో త్వరితగతిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్వేత, విఠల్, సిరాజుద్దీన్, కార్తికేయ, ప్రవీణ్‌కుమార్ తదితరులుపాల్గొన్నారు.

గుంతలు పూడ్చరు.. బస్సులు నడపరు

- మోకాలి లోతు గుంతల్లో నిలుస్తున్న వర్షపు నీరు
- ఏళ్ల తరబడి అవస్థలు పడుతున్న ప్రజలు
- బస్సు సౌకర్యం లేని గ్రామాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



గుంతలు పడి వర్షపు నీరు నిలిచిన నెట్టెంపాడు- నీలహళ్లి రోడ్డు

ధరూరు: మండలంలోని గ్రామీణ ప్రాంత రోడ్లు గుంతలమయంగా మారి నానా అవస్థలు పడుతున్నట్లు మండల ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలంలో ప్రారంభం కావడంతో రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలిచి ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి అవస్థలు పడుతున్న అధికారుల తీరు మారడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేటికీ మట్టి రోడ్లే...

స్వాతంత్య్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా మండలంలోని గ్రామాల్లో సరైన రోడ్డు సౌకర్యాలు లేవు. ఎన్నికల సమయాల్లో ఇచ్చిన హామీలు నీటి మూటలు గానే మిగిలిపోతున్నాయని ప్రజలు



గుంతలమయంగా నెట్టెంపాడుకు వెళ్లే రోడ్డు

ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని నెట్టెంపాడు- నీలహళ్లి, మన్నాపురం- గుర్రోనిపల్లి, దోర్నాల- గుర్రోనిపల్లి, కొత్తపాలెం- దోర్నాల, మార్లబీడు- కోతులగిద్ద తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లు నేటికి బీటీకి నోచుకోలేదు. మట్టిరోడ్లు కావడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలతో రోడ్లపై పెద్ద గుంతలు ఏర్పడటంతో ప్రమాదాలకు గురవుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు.

బస్సు సౌకర్యం కూడా కరువు

మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు సరిగా లేకపోవడంతో ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా కరువైంది. నేటికి నెట్టెంపాడు, నీలహళ్లి, గుర్రోనిపాలెం తదితర గ్రామాల ప్రజలు ఎక్కడికి ప్రయాణించాలన్నా ప్రైవేటు వాహనాలనే ఆశ్రయించాల్సి వస్తోంది. లేదా ఆయా స్టేజీల వరకు వెళ్లి అక్కడి నుంచి బస్సులకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేరుకే బీటీ రోడ్డు...

మండలంలోని ధరూరు- జూరాల ప్రాజెక్టు వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారైంది. ఈ మార్గం ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు ఆర్టీసీ అధికారులు కనీసం ఒక్క బస్సు కూడా నడపలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు వాహనాలు కూడా అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీరుబండకు చెందిన వారు చింతరేవుల లేదా వామన్‌పల్లి గ్రామాలకు చేరుకుని రాకపోకలు సాగిస్తున్నారు. గుర్రోపల్లి వాసులు ఎక్కిడికి వెళ్లాలన్నా 6–7 ఏడు కిమీ దూరంలో ఉన్న ధరూరు చేరుకోవాల్సిందే. ఇక కావులకుంట గ్రామ ప్రజలు మాత్రం 3 కిమీ దరంలో ఉన్న రాయచూర్‌కు రోడ్డుకు వెళ్లి ప్రయాణాలు సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామీణ రోడ్లు బాగు చేయాలని కోరుతున్నారు.

గుంతలమయంగా రోడ్డు



మా గ్రామం నుంచి నీలహళ్లికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. వారం రోజులుగా కురుస్తున్న చెదురు మదురు వర్షాలతో గుంతల్లో వర్షపు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నాం. కొన్నేళ్ల క్రితం రోడ్డు బీటీగా మార్చేందుకు మంజూరు లభించినా నేటికీ రోడ్డు వేయలేదు.

– గోవిందు, నెట్టెంపాడు

బస్సు నడపడం లేదు



మా గ్రామానికి నేటికీ రోడ్డు సౌకర్యం లేదు. ఎన్నికల సమయంలో రోడ్డు వేస్తామని హామీలు ఇస్తున్నా అమలు మాత్రం కావడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. నెట్టెంపాడుకు వెళ్లాలంటే నాగర్‌దొడ్డి, ద్యాగదొడ్డి మీదుగా వెళ్లాల్సి వస్తోంది.

– రాములు, నీలహళ్లి

నివేదిక పంపించాం

ప్రస్తుతం పంచాయతీల్లో రోడ్ల మరమ్మతులకు ఎలాంటి నిధులు లేవు. బీటీ, మెటల్ రోడ్ల నిర్మాణం కోసం ఆయా గ్రామాలకు సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. నిధులు మంజూరైతే రోడ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం రోడ్ల సమస్యలు తీవ్రంగా ఉన్న గ్రామాల్లో తాత్కాలికంగా మరమ్మతు చేయించి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– నాగరాజు, ఏఈ పంచాయతీ రాజ్ శాఖ ధరూరు

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



నాగర్‌దొడ్డిలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాసంతి



వెంకటాపురంలో చిన్నారికి అన్నప్రాసన చేయిస్తున్న సీడీపీఓ హేమలత

మల్దకల్: తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాసంతి అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని నాగర్‌దొడ్డి గ్రామంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. పుట్టిన పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని సూచించారు. అదే విధంగా పోషకాలు ఎక్కువగా ఉండే పండ్లు, పాలు, ఆకు కూరలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సౌజన్య, అంగన్‌వాడీ టీచర్లు వనజాక్షి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు హేమలత ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల గురించి వివరించారు. ఫోటో (04 ఎఎల్‌పి 306) వెంకటాపురంలో చిన్నారికి అన్నప్రాసన చేయిస్తున్న సీడీపీఓ హేమలత అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం అందించాలి

అయిజ: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సరైన పోషకాహారం అందించాలని సీడీపీఓ హేమలత అన్నారు. మండలంలోని వెంకటాపురంలో సీడీపీఓ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన చేశారు. నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని, ఎప్పటికప్పుడు చిన్నారుల ఆరోగ్యంతో పాటు గర్భిణులు, బాలింతలు ఆరోగ్య వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

అయిజ: మండలంలోని ఉప్పల గ్రామంలో సోమవారం మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి తిరిగి వివరించారు. ముఖ్య అతిథిగా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ రామచంద్రారెడ్డి హాజరై కేంద్ర పథకాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలనలో ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్, రామ మందిరం నిర్మాణం, సర్జికల్ స్ట్రైక్, ఆపరేషన్ సింధూర్, కరోనా వ్యాక్సిన్ వంటి చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. అదే విధంగా ఉచిత బియ్యం, సీసీరోడ్లు, డ్రైయినేజీల నిర్మాణం, రైతువేదికలు, వైకుంఠధామాల నిర్మాణం, పల్లె ప్రకృతి



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

వనాల ఏర్పాటు, విశ్వకర్మ, ముద్ర రుణాలు ఇస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ , పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, లక్ష్మణ్‌గౌడ్, శంకర్, వీరేశ్, నరసింహులు, గోవిందు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం

మల్దకల్: క్షయవ్యాధిని పూర్తి స్థాయిలో నిర్మూలించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైద్యుడు రాజు అన్నారు. సోమవారం మండలంలోని పాల్వాయి గ్రామంలో ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 60 ఏళ్లు పైబడిన వారితో పాటు అధిక బరువు, మద్యపానం సేవించే వారికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. అదే విధంగా రక్తపోటు, డయాబెటిక్ ఉన్న వారిని గుర్తించి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. క్షయ వ్యాధిగ్రస్తులు మందులను క్రమం తప్పకుండా వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.



టీబీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కార్యక్రమంలో డాక్టర్ ప్రణీత, ఎంహెచ్‌పీ సూపర్‌వైజర్ శ్రీధర్, దేవన్న, హెల్త్ అసిస్టెంటు మనోహరమ్మ, పద్మ, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగం కావాలి

అయిజ: మండల కేంద్రంలో అఖిలపక్ష నాయకులు సోమవారం రిటైడ్ టీచర్ జగపతిరెడ్డిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. అదే విధంగా ఆయన్ను అఖిలపక్ష కమిటీ గౌరవ అధ్యక్షుడిగా నియయించారు. ముఖ్య అతిథిగా అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటి చైర్మన్ దొడ్డెప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం సమాజ సేవలో భాగం కావాలని కోరారు. అనంతరం అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడారు. అఖిలపక్ష కమిటీ ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు వెంకట్రాముడు, బీఆర్ఎస్వీ నాయకుడు పల్లయ్య, బీజేపీ నాయకుడు రామచంద్రారెడ్డి, ప్రజా సంఘాల నాయకుడు విజయభాస్కర్ రెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ తాహేర్ తదితరులు పాల్గొన్నారు.



జగపతిరెడ్డిని సన్మానిస్తున్న అఖిలపక్ష కమిటీ నాయకులు

వర్షం కోసం రైతన్నల పూజలు



చెన్నిపాడులో వేప, రాగి చెట్టుకు కల్యాణం జరిపిస్తున్న గ్రామస్తులు

ఉండవెల్లి: మండల కేంద్రం, మండల పరిధిలోని ఇటిక్యాలపాడు, బొంకూరు గ్రామాల్లో వర్షం కోసం రైతన్నలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ సోమవారం సందర్భంగా మండల కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పరమశివుడికి 1001 బిందెలతో జలాభిషేకం చేశారు. కృష్ణా, తుంగభద్ర నదుల నుంచి నీటిని ఊరేగింపుగా తెచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఇటిక్యాలపాడులోని శివాలయంలో అభిషేకం నిర్వహించి ప్రత్యేక క్రతువులు నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రావి, వేప చెట్టుకు పెళ్లి

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామంలో సోమవారం వర్షాల కోసం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రావి, వేప చెట్టుకు పెళ్లి చేశారు. హిందూ పూరణాల ప్రకారం వేపచెట్టును లక్ష్మిగా, రావిచెట్టును మహావిష్ణుగా పూజించి కళ్యాణోత్సవం జరిపించారు. అదే విధంగా చందూరులో గ్రామదేవతలకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ఇటిక్యాలపాడులో బిందెలతో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు



ఇటిక్యాలపాడులో వర్షం కోసం ట్రాక్టర్లలో స్వామివారి ఊరేగింపు

ఏఈపై చర్య తీసుకోవాలని ఫిర్యాదు

గట్టు: మిషన్ భగీరథ నీరు బల్గెర గ్రామంలో సక్రమంగా రావడం లేదని, సంబంధిత ఏఈకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని బీఎస్పీ గద్వాల నియోజకవర్గ అధ్యక్షుడు బండారి ఎస్.రాజు, స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు బండారి సునంద్‌లు అడిషనల్ కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. బల్గెర గ్రామంలో రోజు విడిచి రోజు నీటి సరఫరా జరుగుతుందన్నారు. ఏఈ వెంగమునికి ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఏఈపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు వసతులు కల్పించాలి

గద్వాల: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలని బీఆర్ఎస్వీ నాయకుడు కురువ పల్లయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని చింతలపేట ఎస్సీ సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి భూమిపూజ



రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డి గ్రామంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి గ్రామస్తులు సోమవారం భూమి పూజ చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.19 లక్షల నిధులు మంజూరు కావడంతో స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాల వద్ద భవనం నిర్మించేందుకు గతంలో తీర్మానం చేశారు. ఈ మేరకు భూమి పూజ చేశారు. గ్రంథాలయ ఏర్పాటుతో పాఠకులు, విద్యార్థులు, పరీక్షలకు పోటీపడే అభ్యర్థులకు ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మానవపాడు: వసతిగృహంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ అన్నారు. మండల కేంద్రంలో వెనుకబడిన తరగతుల వసతిగృహాన్ని సోమవారం తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. సౌకర్యాల విషయంలో కొరత ఉండకూడదని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్‌కు సూచించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

అలంపూర్: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఉండవెల్లి ఎస్‌ఐ శేఖర్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే తక్షణమే 1930ను సంప్రదించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించాలన్నారు. సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సైబర్ వారియర్ కానిస్టేబుల్ రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



అలంపూర్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



ఎర్రవల్లి గురుకులలో విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అలంపూర్: విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మండల వైద్యాధికారి భరత్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల హాస్టల్‌లో విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల బరువు, ఎత్తు వివరాలను నమోదు చేశారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ...విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భోజనం చేయడానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ పుష్పలత, ఆరోగ్య కార్యకర్తలు ఉలిగమ్మ, శ్యామల దేవి, సురేఖ, బాలీశ్వరయ్యశెట్టి, చిట్టమ్మ, జయమ్మ, నాగేశ్వరమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఎర్రవల్లి: పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి రాధిక అన్నారు. మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఇటిక్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 532 మంది విద్యార్థులకు గాను 181 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం పాఠశాల పరిసరాలు పరిశీలించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పకుండా పాటించాలన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే ఆరోగ్య కేంద్రానికి రావాలని రాధిక సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామాంజనేయులు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల నిధులపై ఆడిట్

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి డిగ్రీ కళాశాలలో సోమవారం అలంపూర్, మానవపాడు, ఉండవెల్లి మండలాల పాఠశాలల నిధులపై ఆడిట్ జరిగినట్లు ఎంఈఓ రామకృష్ణ తెలిపారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలు, కేజీబీవీలు, టీఎంసీ హైస్కూల్, ఎమ్మార్సీలకు సంబంధించిన రికార్డులను జిల్లా ఆడిట్ అధికారులు పరిశీలించార్నారు. పాఠశాలలు, ఎమ్మార్సీలకు వచ్చిన నిధులపై ఆడిట్ కొనసాగినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు శివప్రసాద్, అశోక్‌కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయంలో..

ఎర్రవల్లి: కొండేరులోని మండల విద్యాధికారి కార్యాలయంలో ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పాఠశాల నిధులపై ఆడిట్ నిర్వహించారు. ఎంఈఓలు అమీర్‌పాష, వెంకటేశ్వర్లు ఉమ్మడి మండలంలోని 53 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన నిధుల వివరాలను తనిఖీ చేసి వాటి ఖర్చుల వివరాలను గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అలంపూర్ చౌరస్తాలో ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

ఎమ్మార్సీ కార్యాలయంలో

అయిజ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం హైదరబాద్ ఆడిట్ సభ్యులు ఆడిట్ నిర్వహించారు. 2024– 25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలకు నిర్వహణకు మంజూరైన నిధులు, ఖర్చు పెట్టిన నిధుల గురించి ఆడిట్ నిర్వహించారు. అయిజ మండలం పాఠశాలల ఆడిట్‌ను రమేష్ నిర్వహించగా గట్టు, వడ్డేపల్లి, రాజోళి మండలాల పాఠశాలల ఖర్చులకు సంబంధించిన ఆడిట్ చేస్తున్నట్లు సభ్యులు వీరు, సురేష్, శివరాం పేర్కొన్నారు.